www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 26 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 8

## అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు



- తుఫాన్ బాధితులకు త్వరలో నష్టపరిహారం
- ఎంఎల్‌ఏ కూనంనేని

2 లో

# అంగడి సరుకుగా ధృవీకరణ పత్రాలు






-అక్రమార్కులపై చర్యలేవి...?
-యథేచ్ఛగా పింఛన్ పొందుతున్న అనర్హులు
-అధికారులపైన విచారణ


ప్రజాపక్షం/ ఖమ్మం : అంగడి సరుకుగా ప్రభుత్వం జారీ చేసే ధృవపత్రాలు మారాయి. కాసులుంటే దేనినైనా కొనుగోలు చేయవచ్చునని కొందరు అవినీతి అధికారులు రుజువు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం పైబడి వైకల్యం ఉన్న వారికి నెలకు రూ.4,016 పింఛన్ ఇస్తుంది. కొందరు అక్రమార్కులు అడ్డదారిలో పింఛన్ పొందెందుకు సదరం ద్వారా ధృవీకరణ పొందుతున్నారు. బోనకల్ మండలంలో కొందరు పైరవీకారులు ఎటువంటి వైకల్యం లేని వారి నుంచి రూ.30 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేసి ఖమ్మం సదరం క్యాంపుల ద్వారా 40 శాతానికి పైబడి వైకల్యం ఉన్నట్లు ధృవీకరణ పత్రాలను మిగతా 2లో..

# జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య ద్రోహి

-సామాన్యులే లక్ష్యంగా కేంద్రం పన్ను
-భూ లొల్లిలో ప్రజా సమస్యలు పక్కదారి
-ప్రజా సంఘాల సమావేశంలో బాగం




ప్రజాపక్షం/ ఖమ్మం : కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యులు జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య ద్రోహి అని అతన్ని వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేవిధంగా వ్యవహరించిన జ్ఞానేష్ కుమార్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పక్కనపెట్టి బిజెపికి అనుకూలంగా వ్యవహరించి ఫలితాలను తారుమారు చేసిన జ్ఞానేష్ కుమార్ భారతదేశ ఎన్నికల చరిత్రకు తీరని కలంకాన్ని తీసుకు వచ్చారన్నారు. బిజెపి మూడవ సారి గెలుపు కోసం అడ్డదారులు తొక్కిందని ఆది నుంచి ఆరోపిస్తున్నట్లుగానే ఎన్నికల కమిషన్ ఏర్పాటులో కొత్త నిబంధనలను తీసుకు వచ్చిందన్నారు. 2004 పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో పాటు జ్ఞానేష్ కుమార్ ఎన్నికల సంఘం బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికలను రద్దు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉన్న భారత్‌లో ఈవిఎంల ద్వారా ఫలితాన్ని మార్చివేశారని ప్రజల అభిప్రాయం ప్రస్ఫుటం కాలేదన్నారు. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని దేశ వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా పన్నులు విధిస్తుందని గతంలో జిఎస్టి పేరుతో దోపిడీ చేసిన ప్రభుత్వం యుపిఐ ఛార్జీల ద్వారా ప్రజల నడ్డివిరిచేందుకు ప్రయత్నిస్తుందని హేమంతరావు తెలిపారు. బిజెపి దేశ ప్రజల పక్షాన కాకుండా కార్పొరేట్ల పక్షాన పాలన చేస్తుందని అతి కొద్ది మంది కోసమే మోడీ ప్రధానిగా వ్యవహరిస్తున్నారన్నారు. మోడీ 12 ఏళ్ల పాలనలో పేద, సామాన్య ప్రజలకు అనుకూలంగా ఒక చట్టం తేకపోగా అనుకూలంగా ఉన్న చట్టాలను మార్పు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన మిగతా 2లో..



# ప్రైడే.. డ్రైడేకు చెల్లు చీటీ..?



**రోగాల భయంతో ప్రజలు**

ప్రజాపక్షం/చింతకాని : దోమల నివారణ, పారిశుద్ధ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రైడే.. డ్రైడే కార్యక్రమం ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కాగితాలకే పరిమితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి శుక్రవారం గ్రామాల్లో నిల్వ నీటిని తొలగించడం, మురుగు కాలువలను శుభ్రంచేయించడం, దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేయించడం వంటి నివారణ చర్యలు చేపట్టాల్సిండగా గ్రామల్లో కార్యదర్శులు ఈ కార్యక్రమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మురుగు, నిల్వ నీరు, దోమలకు ఆవాసం గ్రామాల్లోని వీధుల్లో మురుగు కాలువలు పేరుకుపోవడం, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండటం పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దోమలకు అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. సాయంత్రం వేళ దోమల బెడదతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణ చర్యలు లేకపోవడంతో సీజనల్ వ్యాధుల భయంతో మిగతా 2లో..

# కరువు కోరలకు.. ఉపాధి బాసట

- ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు విబిజీ రామ్ జీ పథకం
- సిబ్బందికి ప్రారంభమైన శిక్షణా తరగతులు
- ముందస్తు ప్రణాళికలకు రంగం సిద్ధం
- అక్టోబర్ 1 నుండి కొత్త పనులు
- సన్నద్ధమవుతున్న సర్కార్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వాతావరణంలో చోటు చేసుకుంటున్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో కరువు ఛాయలు తరుముకొస్తున్నాయి. పేదల ఇబ్బందులను తొలగించాలనే సంకల్పంతో పాలకులు ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు విబిజీ రామ్‌జీ ఉపాధి హామీ పనులు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే సిబ్బందికి మొదలు పెట్టిన శిక్షణ తరగతులు 26వ తేదితో ముగియనున్నాయి. ఎల్‌నినో ప్రభావం అన్ని జిల్లాల్లో ఉండనుండటంతో గ్రామీణ ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడతారని పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి మిగతా 2లో..



# అంగడి సరుకుగా ధృవీకరణ పత్రాలు

**(మొదటిపేజీ తరువాయి)**
అందిస్తున్నారు. దీనితో బోనకల్ మండలంలో పైరవీకారుల జోరు కొనసాగుతుంది. ఎటువంటి వైకల్యం లేకుండానే నెలకు రూ.4, 016 పింఛన్ వస్తుండడంతో సామాన్యులు ఈ పైరవీకారులకు పెద్ద మొత్తంలో ముట్ట జెప్పుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కొందరు అక్రమ పద్ధతుల్లో ఎటువంటి వైకల్యం లేకుండానే పింఛన్ పొందుతుండగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ దరఖాస్తు కోరిన తర్వాత అనేక మంది అనర్హులు దరఖాస్తు చేసుకున్నారు. విచారణకు వెళ్లిన అధికారులు సైతం ప్రలోభాలకు గురికావడంతో వైకల్యం ఉన్నట్లు నిర్ధారిస్తున్నారు. ప్రతి నెల పెద్ద మొత్తంలో ప్రజా ధనం వృథా అవుతుంది. కొందరు కుల సంఘాల పేరుతో వయస్సు లేకున్నా వృద్ధాప్య పింఛన్ పొందుతున్నారు. ఆధార్ కార్డులో వయస్సు మార్చి పింఛన్ పొందుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. వీరి సంఖ్య కూడా మండలంలో గణనీయంగానే ఉంది. పింఛన్ పొందుతున్న అనర్హులకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అనర్హులకు ధృవీకరణ పత్రాలు అందజేసిన వైద్యులు ఇతర అధికారులపైన పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గ్రామాల్లో సామాన్యులకు ఆశచూపి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడిన పైరవీకారులపైన చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కరువు కోరలకు ఉపాధి బాసట

**(మొదటిపేజీ తరువాయి)**
సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వాలు నూతన మార్గదర్శకాలు విడుదల చేశాయి. ఏఒక్క కూలీ కూడా పనులు లేకుండా పస్తులండరాదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మరింత కసరత్తు చేస్తోంది. కూలీలకు చేతి నిండా పనులు దొరికే విధంగా కొత్తపనులు కూడా గుర్తించి ప్రణాళికలు రచించనున్నారు.

**ప్రారంభమైన శిక్షణా తరగతులు :** సిబ్బందికి ఇప్పటికే ప్రారంభమైన శిక్షణా తరగతులు నేటితో ముగియనున్నాయి. ఈనెల 27 నుండి 30 వరకు ముందస్తు ప్రణాళికల రూపకల్పన చేయనున్నారు. అక్టోబర్ 2న గ్రామసభల నిర్వహణతో పాటు పనుల ఆమోదం జరగనుంది. పేదలు కరువు ఛాయల్లో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వాలు పెద్దన్నపాత్ర పోషించే పనిలో ఉన్నాయి.

**అక్టోబర్ 1 నుండి 2027 జూన్ వరకు :** అక్టోబర్1వ తేది నుండి 2027వ సం. జూన్ నెలాఖరు వరకు ప్రతీ గ్రామంలోని కూలీలందరికీ పని కల్పించనున్నారు. విబి జీరామ్ జీ 2025 చట్టాని అనుసరించి కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాలతో రాష్ట్ర స్థాయి అధికారులు ఇటీవల నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముందుగా ఉపాధి పనులను ఎలాంటి ఆంటంకం లేకుండా నిర్వహించేందుకు కృషి చేసే సిబ్బంది శిక్షణ ఎంతో అవసరంగా భావించి తరగతులు నిర్వహించారు. గ్రామ మండల జిల్లా స్థాయి సిబ్బందిని బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి వారికి తర్ఫీదు ఇవ్వనున్నారు. ఆ సిబ్బంది వాస్తవాలను సర్వే చేసి పనుల ఆవశ్యకతతోపాటు గతంలో ఉపాధి పనులు ఎందుకు సక్రంగా జరగలేదనే దానిపై నివేదికలు ఇందించాల్సి ఉంది. అవసరమైన జాగ్రత్తలను తెలుపుతూనే ఎన్‌నినోవల్ల రాబోవు రోజుల్లో పరిస్థితిని ఎదుర్కునేందుకు సమగ్ర అవగాహన కల్పిస్తారు. కరువు ప్రభావాన్ని తగ్గించడానికి ఏం చేస్తే బాగుటుందనే విషయంపై ప్రణాళికలను సిద్ధం చేసి అందించాల్సి ఉంటుంది.

**పనుల కోసం ప్రత్యేక మ్యాప్‌లు :** గ్రామాల్లో వాస్తవానికి ఏఏ పనులు అవసరం ఉందనే దానిపై కార్యచరణ రూపొందిస్తూ అందుకు అనుగుణంగా మ్యాప్‌లు సిద్ధం చేయాల్సి ఉంది. ఉధ్యాన వనాలు, వ్యవసాయ అనుబంధం మొక్కలు పెంపకం, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పనుల గుర్తింపు చేపడతారు. అనంతరం గ్రామసభల ద్వారా పనుల ప్రతిపాదనలు అమోదాలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా 100 రోజుల పని దినాలకు బదులుగా 125 రోజుల పనిదినాలను కల్పించనున్నారు. సుమారు 375 రకాల పనులు ఈ పథకంలో భాగంగా నిర్వహించనున్నారు. మొత్తంగా ఎల్‌నినో ప్రభావంతో ఎదురవనున్న కరువు ముప్పును తట్టుకునే విధంగా ఉపాధిని అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యచరణపై అన్ని వర్గాల్లో పలు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఫ్రైడే.. డ్రైడేకు చెల్లు చీటీ..?

**(మొదటిపేజీ తరువాయి)**
ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
చిన్నపిల్లలను దోమల నుంచి కాపాడుకునేందుకు దోమతెరలు, కాయిల్స్ ను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ప్రజలు జ్వరాలబారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### కనిపించని టీంవర్క్..

గతంలో ఫ్రైడే. డ్రైడే కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్ వాడీ టీచర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, ఐకేపీ వీఓఏ గ్రామపంచాయతీ సిబ్బంది తో కలిసి ప్రతి ఇంటికి తిరుగుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరిస్తూ నిల్వ నీటిని తొలగిస్తూ ఆయిల్ బాల్స్ వేస్తూ అవగాహన కల్పించేవారు. ఇది క్రమం తప్పకుండా చేసేవారు. కానీ ఈ ఏడాది ఏ గ్రామంలో కూడా ఇలాంటి టీం వర్క్ కనిపించడం లేదు. కేవలం పంచాయతీ కార్యదర్శులు మాత్రమే తమ సిబ్బందితో కాలువలో చెత్త తొలగింపు వంటి పారిశుద్ధ్య కార్యాక్రమాలకే పరిమితమవుతున్నారు. కొందరు కార్యదర్శులైతే వీటికి కూడా దూరంగా ఉంటున్నారు.

### అధికారులు స్పందించాలి..

ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తే రేపటి వ్యాధులకు ఎవరు భాధ్యత వహిస్తారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం గ్రామాల్లో తప్పనిసరిగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్దితులను పరిశీలించి మురుగు కాలువల శుభ్రత, నిల్వ నిటి తోలగింపు దోమల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై వివరణ కోసం ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్‌ను ప్రజాపక్షం సంప్రదించగా ఆయన స్పందించలేదు.

# గోదావరి ఒడికి చేరిన గణనాథుడు

**భక్తిశ్రద్ధలతో నిమజ్జనం**

**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. నవరాత్రుల సందర్భంగా గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, భజనలు, ఆథ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుడి విగ్రహాలను పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గణేష్ విగ్రహాలను భద్రాచలం గోదావరి నిమజ్జనానికి తరలించారు. "గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అంటూ భక్తులు భక్తిభావంతో గణనాథుడికి వీడ్కోలు పలికారు.భద్రాచలం గోదావరి తీరానికి చేరుకున్న అనంతరం భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి గోదావరి జలాల్లో విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. గణనాథుడి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, పాడిపంటలు సమృద్ధిగా కలగాలని భక్తులు ప్రార్థించారు.సుజాతనగర్ మండలంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరిగాయి. నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి భారీ పోలీసు బందోబస్తు



ఏర్పాటు చేశారు. విగ్రహాలను తరలించే మార్గాల్లో పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షించారు. దీంతో నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో సజావుగా పూర్తయ్యాయి. తొమ్మిది రోజుల పాటు సుజాతనగర్ ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో భక్తి వాతావరణం నెలకొనగా, పలుచోట్ల నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిమజ్జనంతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగిసినా గణనాథుడి భక్తి జ్ఞాపకాలు ప్రజల మనసుల్లో నిలిచిపోయాయి. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన భక్తులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు, నిర్వాహకులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

**ప్రజాపక్షం/పాల్వంచ :** తుఫాన్‌తో నష్టపోయిన కుటుంబాలు అధైర్య పడొద్దని అండగా ఉంటామని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు భరోసా ఇచ్చారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న దంతెలబోర ఎస్‌సి కాలని గ్రామాన్ని ఆయన అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం సంధర్శించారు. ఈ సంధర్భంగా గ్రామంలో పర్యటించారు. ఆర్నాబ్ తుఫాన్‌తో ధాటికి కూలిన ఇండ్లను పరిశీలించారు. సర్వస్వం కోల్పోయి దిక్కుతోచన బాదితులను కలిసి ఓదార్చారు. ఎవరూ అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో జరిగిన ఆస్థి నష్టం, విద్యుత్ సరఫరా లేకపోవటంతో పడుతున్న ఇబ్బందులను ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకొచ్చారు. స్పంధించిన ఎంఎల్‌ఏ కూనంనేని వెంటనే విరిగి పడిన స్థంభాలను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించటానికి తక్షణ చర్యలు చేపట్టాలని, వైద్య శిభిరం ఏర్పాటు చేయాలని సంభంధిత అధికారులకు సూచించారు. ఇండ్లు దెబ్బతిన్న పేదలకు ప్రభుత్వ నిభంధనల మేరకు నష్ట పరిహారం అందించటానికి త్వరగా తగు నివేదికలు తయారు చేయాలని రెవిన్యూ ఆధికారులను ఆదేశించారు. గ్రామంలో జరిగిన నష్టంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి ప్రత్యేక నిధులు మంజూరు చేయించటానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, తహశీల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ పి. రాజారావు, ఎలక్ట్రికల్ డిఈ, ఏఈలు, మండల వ్యవసాయాధికారి శంభోశంకర్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు నిమ్మల రాంబాబు, నారాయణరావు పేట సర్పంచ్ సరస్వతి, నాయకులు కోలేటి రాంబాబు, ప్రేమ్‌చంద్, ప్రశాంత్, సాయిలి శ్రీను, వెల్లంకి శివరావు, సత్యనారాయణరాజు, మేక రాంబాబు, జకరయ్య, అమీర్, మోహన్, అల్లి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య ద్రోహి

**(మొదటిపేజీ తరువాయి)** తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా వ్యవహరిస్తుందని గడిచిన కొన్ని రోజులుగా భూ సమస్యలు ముఖ్యంగా 22ఎ పై రాష్ట్రం అట్టుడుకుతుందని ఆయన తెలిపారు. భూ సమస్యకు నిర్దిష్ట పరిష్కారం చూపాలని మూడు ప్రధాన పార్టీలు అయినా కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి పరస్పర ఆరోపణల నడుమ ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని హేమంతరావు తెలిపారు. ప్రజా సమస్యలు చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత దూషణ బీషణలు ఎజెండాపైకి వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని సరైన రీతిలో అమలు చేయలేదని ముఖ్యంగా పింఛన్లు, ఇందిరమ్మ భరోసా, కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ లో ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బహుముఖ పోరాటాలకు సిద్దం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంలో కత్తులతో హల్‌చల్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గణేష్ నిమజ్జన శోభాయాత్రలో కొంత మంది యువత కత్తులతో హల్ చల్ చేస్తూ కలకలం సృష్టించిన ఘటన మండల పరిధిలోని పువ్వాడ నగర్‌లో చోటు చేసుకుంది. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కొంత మంది యువకులు తల్వార్‌లను చేతబూని నృత్యాలు చేస్తూ హల్‌చల్ చేశారు. నిమజ్జన వేడుకలను చూసేందుకు వచ్చిన స్థానికులు, మహిళలు, చిన్నారులు తల్వార్‌లతో యువకులు చేసిన విన్యాసాలను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. సర్పంచ్ అండ దండలతోనే యువకులు ఈవిధంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల దుర్వినియోగంపై శుక్రవారం ఖమ్మం నగరంలోని బేబీమూన్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారీన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా తన జీవితంలో ఎదురైన అనుభవాలను ఉన్నత స్థాయికి చేరుకోవడానికి పడ్డ శ్రమను డిప్యూటీ కమిషనర్ విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తినింపారు. ఈ కార్యక్రమంలో బేబీమూన్ పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్న, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు రిజిస్ట్రేషన్‌ను గడువులోగా పూర్తి చేసుకోవాలి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** మండలంలోని రైతులందరూ ఫార్మర్ ఐడీ (రైతు రిజిస్ట్రేషన్) నమోదు ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు సుధాకర్ సూచించారు. శుక్రవారం సుజాతనగర్ మండలంలోని ముగ్గురు ఏఈఓల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని అధికారులు సందర్శించి పరిశీలించారు. ముఖ్యంగా భూమి వివరాలు, ఆధార్ వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహం లేదా సమస్య ఉంటే సంబంధిత ఏఈఓలను సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నర్మద, ఏఈఓలు నరసింహ, నవ్య, స్వప్న, రైతు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి

**-చెరువులకు మళ్లిస్తూ నీటి నిల్వలు పెంచాలి**
**-అధికారులకు కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశం**





**ప్రజాపక్షం/కూసుమంచి:** పాలేరు జలాశయానికి వస్తున్న వరద నీటిని వృథా కాకుండా జిల్లాలోని చెరువులకు మళ్లించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం పాలేరు జలాశయాన్ని పరిశీలించిన ఆయన నీటి మట్టం, కాలువల ద్వారా విడుదలవుతున్న ప్రవాహం, అలుగు వద్ద పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వర్షాలతో జిల్లాలోని పలు చెరువుల్లో 25 నుంచి 30శాతం వరకు నీటి నిల్వలు చేరాయని తెలిపారు. సాగర్ ఎడమ కాలువ, పాలేరు పాతకాలువ, భక్త రామదాసు, మంచుకొండ ఎత్తిపోతల పథకాలతో పాటు ఇతర నీటి వనరుల ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తరలించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని రిజర్వాయర్లు, చెరువుల నీటిని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అల్పపీడనం నేపథ్యంలో జిల్లాయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి జేసీబీలు, పునరావాస కేంద్రాలు, అత్యవసర సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షాలు, వరద పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రెండు రోజుల వర్షాలతో పత్తి, మిర్చి, వరి రైతులకు ఉపశమనం లభించిందని కలెక్టర్ తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా రాబోయే సంవత్సరాల్లో పంటల వైవిధ్యీకరణపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం కామంచికల్, కొంగర, ఈశ్వరమాధారం గ్రామాల్లో భూ రీ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక పరికరాలతో జరుగుతున్న డిజిటల్ సర్వేను రైతుల సమక్షంలో పరిశీలించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ పరాస్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వేయర్ ఏడీ రాజేందర్, డీఈఈ రమేశ్‌రెడ్డి, తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, వినేంద్రర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిప్పనపల్లి వైకుంఠధామంలో కనీస సౌకర్యాలు కల్పించండి

**-కర్మకాండలకు తాగునీరు కరువు**
**-గేటు వద్ద గ్రామస్తులు, బంధువుల నిరసన**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలోని వైకుంఠధామంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గ్రామస్తులు, మృతురాలి బంధువులు శుక్రవారం నిరసన తెలిపారు. ఎల్లబోయిన రాజమ్మ(77)మృతదేహానికి కర్మకాండలు నిర్వహించేందుకు వచ్చిన వారికి తాగునీరు సహా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో గేటు వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైకుంఠధామంలోని మంచినీటి బోరు మోటార్ మరమ్మతుకు గురై చాలా కాలమైనా పట్టించుకునే వారు లేకపోయారని ఆరోపించారు. శ్మశాన వాటిక ప్రాంగణం బురదమయంగా మారడంతో కర్మకాండలు, దశదినకర్మలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తాగునీటి కోసం వ్యవసాయ బోర్లు, వాగులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో నిర్మించిన వైకుంఠధామాల్లో కనీస సౌకర్యాలు కల్పించి సక్రమంగా నిర్వహించాలని, తిప్పనపల్లి వైకుంఠధామ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# మారెళ్లపాడు పనుల్లో పారదర్శకత ఎక్కడ..?

**-రైల్వే సమన్వయం..3కిలో మీటర్ల పైపులైన్ కాంట్రాక్ట్‌పై అధికారుల మౌనం ఎందుకు?**
**-కాంట్రాక్టర్లు అధికారుల మధ్య సమన్వయం కుదిరిందా...?**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభంతో రైతుల్లో ఆశలు పెరిగిన వేళ ప్రాజెక్టు పనుల పర్యవేక్షణ, రైల్వే శాఖతో సమన్వయం, సుమారు మూడు కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణ పనుల కాంట్రాక్ట్ ప్రక్రియపై పలు ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. రైల్వే మార్గానికి సమీపంగా చేపట్టిన పనులు, తవ్వకాలు, బ్లాస్టింగ్ వంటి అంశాల విషయంలో రైల్వే అధికారులకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారా, రైల్వే శాఖ నుంచి అనుమతి లేదా ఎన్‌ఓసీ తీసుకున్నా అన్నది స్పష్టం చేయాల్సి ఉంది. ఒక వేళ ఇరు శాఖల అధికారులు పరస్పరం మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకున్నట్లయితే ఆ చర్చలకు సంబంధించిన అధికారిక లేఖాచారం, అనుమతులు, తనిఖీ నివేదికలు ఎక్కడ ఉన్నాయి అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. మౌఖిక సమన్వయంతోనే ప్రభుత్వ పనులు జరిగితే భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అన్నది కూడా కీలక ప్రశ్నగా మారుతోంది. ఇక ముందున్న మూడు కిలోమీటర్ల పైపులైన్ పనుల కాంట్రాక్ట్ విషయంలోనే పూర్తి పారదర్శకత అవసరం. టెండర్ ప్రక్రియ ఎలా జరిగింది? అంచనా వ్యయం ఎంత ఎన్ని సంస్థలు పాల్గొన్నాయి. ఎవరు అర్హత సాధించారు. కాంట్రాక్టర్‌కు చెల్లింపులు ఏ నిబంధనల ప్రకారం జరుగుతాయి. పనుల కొలతలు ఎవరు నమోదు చేస్తారు. నాణ్యతను ఎవరు ధృవీకరిస్తారు, వంటి ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు తెలియాల్సి ఉంది.

### అధికారులు లోతుగా తనిఖీలు చేశారా...?

కాంట్రాక్టర్‌తో ముందస్తు అవగాహన ఏదైనా ఉందా? అనే అనుమానాలు తావులేకుండా టెండర్ పత్రాలు, అగ్రిమెంట్, వర్క్ ఆర్డర్, మెజర్మెంట్ బుక్ క్వాలిటీ కంట్రోల్ నివేదికలను అధికారులు బహిర్గతం చేయాలి. అదే విధంగా పర్యవేక్షణ బాధ్యత వహిస్తున్న డీఈ స్థాయిలో సైట్ ఇన్‌స్పెక్షన్లు ఎన్ని జరిగాయి, ఏ లోపాలను గుర్తించారు? కాంట్రాక్టర్‌కు ఏ సూచనలు ఇచ్చారు, వాటిని అమలు చేయించారా అనే వివరాలు కూడా బయటకు రావాల్సి ఉంది. రైల్వే శాఖకు చెందిన ఏఈ స్థాయిలోనూ తమ పరిధిలోని భద్రతా అంశాలపై ఏమైనా అభ్యంతరాలు, సూచనలు లేదా అనుమతులు ఉంటే వాటిని స్పష్టంగా నమోదు చేయాల్సిన అవసరం ఉంది. రేపు ఏదైనా సమస్య తలెత్తితే మాకు తెలియదు అనే పరిస్థితి రాకుండా ప్రతి అనుమతి, ప్రతి తనిఖీ, ప్రతి సమన్వయం లిఖితపూర్వకంగా ఉండాలి.

### రైల్వే స్థలంలో మట్టి నిల్వలపై లేవనెత్తుతున్న ప్రశ్నలు....

మారెళ్లపాడు పనుల్లో రైల్వే స్థలంలో టన్నుల కొద్దీ మట్టి నిల్వ చేసినట్లు వస్తున్న ఆరోపణలపై ఇప్పుడు పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు, రైల్వే అధికారుల మధ్య ఎలాంటి లిఖితపూర్వక అనుమతులు లేదా అధికారిక సమన్వయం జరిగిందో వెల్లడించాల్సి ఉంది. అనుమతులు లేకుండా రైల్వే స్థలాన్ని వినియోగించినట్లయితే దానిపై ఏ చర్యలు తీసుకున్నారో అధికారులు స్పష్టం చేయాలి, ఈ వ్యవహారంలో ఆర్థిక ప్రయోజనాలు లేదా ముడుపులు చేతులు మారాయనే అనుమానాలు కొందరిలో వ్యక్తమవుతున్నప్పటికీ, వాటికి ఆధారాలు ఉన్నాయా అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

### అధికారుల మౌనం ఎందుకు...?

ప్రాజెక్టు రైతుల ప్రయోజనాలకు సంబంధించినదే అయినప్పటికీ ప్రభుత్వ నిధులతో జరుగుతున్న ప్రతి పనికి నాణ్యత, భద్రత, కొలతలు, బిల్లులు, అనుమతులు, టెండర్ ప్రక్రియ కీలకం. ప్రారంభోత్సవం జరిగిందన్న కారణంతో పర్యవేక్షణపై ప్రశ్నలు ముగిసిపోవు. పనులు నిబంధనల ప్రకారమే జరిగితే రికార్డులు బయటపెట్టడంలో ఇబ్బంది ఏమిటి రైల్వే అనుమతులు ఉంటే వాటిని వెల్లడించడంలో అభ్యంతరం ఎందుకు? పైపులైన్ కాంట్రాక్ట్ పారదర్శకమైతే టెంబర్ వివరాలను ప్రజలకు చూపించడంలో సందేహం ఎందుకు?, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ ప్రశ్నలకు లిఖితపూర్వకంగా స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని, ప్రాజెక్టు పనులపై సమగ్ర సాంకేతిక పరిశీలన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఏఐకేఎంఎస్ మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఈనెల 28,29,30తేదీల్లో ఖమ్మం నగరంలో జరిగే అఖిల భారత రైతు, కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఆళ్లపల్లి మండలం బొడాయికుంట, పెద్దూరు గ్రామాల్లో గ్రూపు సమావేశాలు నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు కొమరం సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి మాట్లాడుతూ ఆళ్లపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో పడిగ సురేష్, పాయం సత్యనారాయణ, గొగ్గెల సీతయ్య, పాయం నరసింహారావు, కొమరం ఎర్రయ్య, గుమ్మడి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలం పెద్ద వెంకటాపురం గ్రామంలో 225 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వజ్జ ఉమా చిరంజీవి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బెండాలపాడులో ఫార్మర్ రిజిస్ట్రీ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామ పంచాయితీ కార్యాలయంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వినయ్(ఏవో)పాల్గొని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్ సహకారంతో రైతుల వివరాలను నమోదు చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతు భూమి, సాగు పంటలు, వ్యక్తిగత వివరాలను ఒకే డిజిటల్ రికార్డుగా నమోదు చేసి ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య అందిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రుణాలు, పంట బీమా తదితర ప్రయోజనాలు అర్హులైన రైతులకు సులభంగా అందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రూ. 51వేలకు గణపయ్య లడ్డూ

**-వేలంలో లడ్డూను దక్కించుకున్న చల్లకోటి పూర్ణచంద్రరావు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయితీ మహాలక్ష్మమ్మ కాలనీలో టీమ్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఉత్సాహంగా సాగిన వేలంలో చల్లకోటి పూర్ణచంద్రరావు రూ 51వేలకు గణపతి లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూవేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా, గణపతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమం భక్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్వాహకులు, భక్తులు పూర్ణచంద్రరావును అభినందించారు.

# మాజీ సర్పంచ్ భర్తతో ప్రాణహాని ఉంది : సర్పంచ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** మాజీ సర్పంచ్ భర్త బానోత్ రాందాస్, అతని అనుచరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని బజ్జాతండ ప్రస్తుత సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు ఆరోపించారు. మండల కేంద్రంలో గ్రామ పెద్దలతో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తనకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. సర్పంచుగా ఎన్నికైనప్పటి నుంచి రాజకీయ విభేదాల నేపథ్యంలో తనపై ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురవుతున్నాయని హనుమంతరావు పేర్కొన్నారు. తనకు, కుటుంబ సభ్యులకు ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే బానోత్ రాందాస్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆరోపించారు. తనకు ఎదురవుతున్న పరిస్థితులపై సర్పంచ్ భార్య వాంకుడోత్ విజయ పోలీస్ స్టేషన్‌తో పాటు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈసమావేశంలో గ్రామస్తులు అజ్మీర హేమల నాయక్, అజ్మీర నరేష్, వాంకుడోత్ గన్యా, అజ్మీర రవి, అజ్మీర కిషోర్ నాయక్, శంకర్, అజ్మీర్ సామ్య పాల్గొన్నారు.

# బాబు కుటుంబానికి టీడీపీ నేతల పరామర్శ



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన సలవాది బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ పరామర్శించారు. స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు వేమూరి సాల్మాన్ రాజ్ సమాచారం మేరకు పార్టీ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను కలుసుకుని సానుభూతి తెలిపారు. దశ దిన కర్మల సందర్భంగా కుటుంబానికి 50కేజీల బియ్యం, 25కేజీల చికెన్, చిల్లర సామగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ఛాందావత్ రమేష్ బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు కార్ నరసన్న, పట్టణ ఉపాధ్యక్షుడు దాసరి గోపాలకృష్ణ, నాయకులు అప్పాల రాకేష్, దేవరకొండ నవీన్, బాసాని నవీన్‌కుమార్, తమనబోయిన భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# వైరా మండలంలో పడకేసిన పాలన..!

-అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?
-గ్రామాల్లో కనిపించని అధికారుల పర్యటనలు
-పిచ్చి మొక్కలతో కమ్మేసిన రోడ్లు
-అస్తవ్యస్థంగా డ్రైనేజీలు..
-పారిశుధ్ధ్య సమస్యలతో ప్రజల ఇబ్బందులు
-డిపివో వినోద్ పర్యటనలో కనిపించని ఎంపిడివో, ఎంపివో





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో గ్రామపంచాయతీల పాలన, పారిశుధ్ధ్య, నిర్వహణపై పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో మొత్తం 22 గ్రామపంచాయతీలు ఉండగా, వాటి పరిపాలనను పర్యవేక్షించాల్సిన అధికారుల కొరత ప్రభావం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తుందని ప్రజలు అంటున్నారు. గ్రామపంచాయతీల పరిపాలనలో కీలకంగా వ్యవహరించంఆల్సిన ఎంపివో స్థాయి అధికారి పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం, అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఇంచార్జి ఎంపివో కృష్ణ పర్యవేక్షణ ఆశించిన స్థాయిలో జరగడం లేదనే ప్రజల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలస్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ, అధికారుల పర్యటనలు పెద్దగా కనిపించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

**పిచ్చి మొక్కలతో రోడ్ల ఆక్రమణ...**

మండలంలోని పలు గ్రామీణ రహదారుల వెంట పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి రోడ్లను కమ్మేస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రెబ్బవరం గ్రామంలో రోడ్ల వెంట మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుధ్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్ల ప్రక్కన పెరిగిన మొక్కలను తొలగించి శుభ్రం చేసే చర్యలు తరచుగా చేపట్టడం లేదని వినిపిస్తున్నాయి.

**అస్తవ్యస్థంగా డ్రైనేజీ వ్యవస్థ..**

మరోవైపు పలు గ్రామాల్లో డ్రైనేజీలు చెత్త, వ్యర్థ పదార్థాలతో నిండిపోవడంతో మురుగు నీరు సక్రమంగా బయటకు వెళ్లడం లేదని ప్రజలు



వాపోతున్నారు. దీంతో అక్కడక్కడ మురుగు నీరు నిలిచిపోవడంతో దోమల సమస్య కూడా పెరుగుతుందని చెబుతున్నారు. ఒకవైపు పారిశుధ్ధ్య సమస్యలు, మరోవైపు దోమల బెడదతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పూర్తిస్థాయి అధికారి అవసరం..**

వైరా మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో పరిపాలన, పారిశుధ్ధ్య, నిర్వహణ, అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ అవసరమని ప్రజలు కోరుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు వైరా మండలంలోని పరిస్థితులపై సారించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మండలానికి పూర్తిస్థాయి సంబంధిత అధికారిని నియమించి గ్రామపంచాయతీలకు సక్రమమైన పర్యవేక్షణ అందించాలని కోరుతున్నారు. లేదంటే గ్రామీణ ప్రాంతాల్లో పాలన మరింత అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**డిపివో పర్యటనలో కనిపించని ఎంపిడివో, ఎంపివో...**

వైరా మండలంలో డిపివో వినోద్ శనివారం తాటిపూడి, రెబ్బవరం, గొల్లపూడి గ్రామపంచాయతీల్లో పర్యటించారు. ఈ పర్యటనలో మండల అభివృద్ధి అధికారి, ఎంపివో లేకపోవడం విశేషం. ఇప్పటికే ఎంపిడివో, ఎంపివో మండలంలో పర్యటించకపోవడం తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

# మధిరకు మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు

**ప్రజాపక్షం/మధిర:** మధిరకు ప్రభుత్వం మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 200 సివిల్ అండ్ క్రిమినల్, అదనపు కోర్టులు మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో ఖమ్మంకు ఆరు, మధిరకు ఒకటి, సత్తుపల్లికి ఒకటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు చేస్తూ ఉత్వర్వులు వెలువడ్డాయి. మధిరకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయడం పట్ల మధిర కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చావలి రామరాజు, న్యాయవాది గంధం శ్రీనివాసరావు, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మధిరకు మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయడంతో జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల సంఖ్య మూడుకు, మొత్తం కోర్టుల సంఖ్య ఐదుగకు చేరింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు అయింది. ఇవి కాకుండా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు(సబ్ కోర్ట్) ఇప్పటికే ఉన్నాయి. వీటితో కలిపి మధిరలో కోర్టుల సంఖ్య ఐదుకు చేరినట్లు అయింది.

# కిసాన్ సభ మహాసభలను జయప్రదం చేయండి





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నవంబర్ 15, 16, 17, 18 తేదీల్లో నల్లగొండ జిల్లాలో నిర్వహించనున్న అఖిలభారత కిసాన్ సభ జాతీయ మహాసభలను జయప్రదం చేసేందుకు పాలేరు డివిజన్ వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నేలకొండపల్లి రావెళ్ల సత్యనారాయణ భవన్‌లో తెలంగాణ రైతు సంఘం మండల జనరల్ బాడీ సమావేశం మండల అధ్యక్షుడు ఇంటూరి అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాసభల్లో దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. మహాసభల విజయవంతానికి ఇంటింటా కరపత్రాల పంపిణీ, రైతులతో ట్రాక్టర్, మోటార్‌సైకిల్ ర్యాలీలు, సెమినార్లు, గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు చేపట్టాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షుడు బిక్కసాని గంగాధర్, మండల కార్యదర్శి రచ్చ నరసింహారావు, కేవీ రామిరెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు, ఏలూరి రామారావు, బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా నిమజ్జనం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో వినాయక విగ్రహాల నిమజ్జనం మూడో రోజు కూడ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాయగూడెం, నేలకొండపల్లి, చెరువుమాధారం తదితర గ్రామాలలో వినాయక ఉత్సవ కమిటి ప్రతినిధులు అత్యంత వైభవంగా నిమజ్జన కార్యక్రమం చేశారు. రాయగూడెం గ్రామంలో సర్పంచ్ బోయిన వేణు ఆధ్వర్యంలో ఆటా, పాటలతో ఉత్సవం విజయవంతంగా ముగించారు. నిమజ్జన కార్యక్రమంను తహాశీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎస్సై శ్రీనివాసరెడ్డి లు పర్యవేక్షించారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థల సర్వే పరిశీలన

-సర్వే నంబర్ 549/1లో ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి
-కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదించిన సర్వే నంబర్ 549/1లో జరుగుతున్న భూ సర్వేను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొంత మంది రైతులు భూ అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించడంతో, కోర్టు ఆదేశాల మేరకు సర్వే కొనసాగుతోంది. పాఠశాల కోసం 20 ఎకరాల స్థలం ప్రతిపాదించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరింఆచరు. రెవెన్యూ రికార్డులు, పాత నక్షాలు, పాస్ బుక్‌లు, భూభారతి, సర్వే ల్యాండ్ రికార్డులను పరిశీలించిన కలెక్టర్, క్షేత్రస్థాయిలో భూమి విస్తీర్ణం, సరిహద్దులు, వాస్తవ పరిస్థితులను రికార్డులతో సరిపోల్చాలని ఆదేశించారు. రైతులు తమ పాత పాస్‌బుక్‌లు, భూపత్రాలను కలెక్టర్‌కు చూపించి సరిహద్దులు స్పష్టంగా నిర్ధారించి నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని కోరారు. రైతులు, అధికారుల వద్ద ఉన్న రికార్డులను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్ సర్వేను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసి వాస్తవ సరిహద్దులను నిర్ధారిస్తూ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పర్యటనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఇల్లందు తహసీల్దార్ ఖాసిం, ఏడీ సర్వే శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# వెంకన్న కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి మొండికట్ట గ్రామానికి చెందిన కుడక వెంకన్న కుటుంబానికి తెలంగాణ మున్నూరు కాపు పటేల్స్ సంక్షేమ సంఘం ఆద్వర్యంలో సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్నూరు కాపు సభ్యుడు కుడక వెంకన్న అనారోగ్యంతో మృతి చెందాడు. దీనితో నిరుపేద కుటుంబం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. సమాచారం తెలుసుకొన్న ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాంపల్లి కనకేష్ నేతృత్వంలో విరాళాలు సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 27,816/లు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్నూరు కాపు పటేల్స్ సంక్షేమ సంఘం సభ్యులు చింతా నాగరాజు, ఆకుల ఆనంద్, మద్దుల వీరమోహన్‌రావు, ఎడవల్లి నవీన్, ఆకుల ఆనంద్, యామినేని ఉప్పల్‌రావు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, తోట మల్లేశ్వరరావు, గందం నరసింహారావు, కనకం రామయ్య, ముళ్ళపాటి శ్రీకాంత్, ప్రభాకర్, వెంకన్న,మద్దిరాల అశోక్, దేశెట్టి క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి

- సకాలంలో సెలబస్ పూర్తి చేయాలి
- హాస్టల్‌ను సంధర్శించిన డిడి



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాఠశాల తరగతి గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటి డైరెక్టర్ ఎస్. చందన అన్నారు. పాల్వంచలో గల ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా సంధర్శించారు.ఈ సంధర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, స్టోర్ రూమ్‌ను, కిచెన్ రూమ్‌ను, పరిసరాలతో పాటుగా 10వ, తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిలబస్ పూర్తి అయిందా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. 3 నుండి 7వ, తరగతి విద్యార్థులను చదివించారు. ఉద్దీపకం ఎలా ఉందని అడిగి తెలుసుకొన్నారు. వంట గదికి వెళ్ళి ఆహారాన్ని రుచి చూశారు. ఉపాధ్యాయులకు వేరుగా బాత్‌రూమ్, టాయిలెట్‌లు నిర్మించాలని టీర్లు ఆమెను కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదవ తరగతిలో వంద శాతం ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని చెప్పారు. 8, 9 తరగతుల వారికి వారధి సిలబస్‌తో పాటుగా రెగ్యులర్ సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వారికి తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట, పాల్వంచ సహాయ సంక్షేమ శాఖ అధికారి చంద్రమోహన్, పాఠశాల హెచ్‌ఎంబి. చెన్నారావు, హెచ్‌డబ్లూ ఏ. కళ్యాణి, పాధ్యాయులు పి. నర్సయ్య, బి. కిషన్, కే. సురేష్, రఘు, ఎం. గంగ, జ్యోతి, ఆదిలక్ష్మి, సరస్వతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# సేవ చేయాలనే మనసే నిజమైన సంపద





**ప్రజాపక్షం/ఇల్లందు:** సేవ చేయాలనే మనసే నిజమైన సంపద అని ఫైర్ స్టేషన్ అధికారి మేదరమెట్ల నవీన్ అన్నారు. శుక్రవారం ఇల్లందు ప్రభుత్వ జూనియన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తోర్తి జాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ యువతలో సేవాభావం పెంపొందాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు, మాదకద్రవ్యాలు, ఎయిడ్స్, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు మరుగుదొడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతలు, పరిశుభ్రత కార్యక్రమాలు, ఎయిడ్స్, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాట్ మీ బట్ యూ సేవా భావంతో విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో లైబ్రేరియన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కాలం ప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంఘం బలోపేతానికి సహకరించాలి

**-సకాలంలో రుణాలు చెల్లించాలి**
**-మహజన సభలో ఛైర్మన్ రావూరి సైదుబాబు**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సహకార సంఘం బలోపేతానికి సహకరించాలని వి. వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ రావూరి సైదుబాబు తెలిపారు. శుక్రవారం వి. వెంకటాయపాలెం సొసైటీలో ఛైర్మన్ రావూరి సైదుబాబు అధ్యక్షతన 64వ మహాజన సభ నిర్వహించారు. ఈ సభలో డిసిసిబి ఏబి మార్గ్ బ్రాంచ్ మేనేజర్ ఇందు, వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, కాకతీయ కో ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ అధ్యాపకులు రాజయ్య, అసిస్టెంట్ డిసివో మై కుమారి, క్లస్టర్ సూపర్‌వైజర్ రాయపూడి శ్రీనివాస్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఛైర్మన్ సైదుబాబు మాట్లాడుతూ రైతులు, సభ్యుల సహకారంతో సొసైటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సొసైటీలో సేవలు అందిస్తున్నట్లు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అతిథులు మాట్లాడుతూ రైతుల ఐక్యత, సభ్యుల భాగస్వామ్యంతోనే సంఘాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. రుణమాఫీ కోసం చూస్తూ చెల్లింపుల్లో జాప్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వం నిర్ణయం మేరకే రుణమాఫీ ప్రయోజనం అందుతుందన్నారు. పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే మూడు శాతం వడ్డీ రాయితీ ప్రయోజనం పొందవచ్చునన్నారు. సహకారం అంటే ఒక వ్యక్తి ఒంటరిగా చేయలేని పనిని అందరూ కలిసి సాధించడమేనన్నారు. ద్రాక్ష పండ్లు గుత్తుగా ఉన్నప్పుడే దానికి ప్రత్యేకత ఉంటుందని ఉదాహరించారు. మహజన సభకు సభ్యుల హాజరు శాతం పెరగాలన్నారు. వైస్ ఛైర్మన్ శ్రీనివాసరావు బంగారు రుణాలకు సంబంధించి వడ్డీ శాతాన్ని తగ్గించే అవకాశాలను పరిశీలించాలని బ్యాంకు అధికారులను కోరారు. సొసైటీ సిఈవో తిరుపతిరావు మాట్లాడుతూ సంఘం పరిధిలో రూ. 23 కోట్ల వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. రూ. 15 కోట్లు పంట రుణాలు, రూ.9.30 కోట్లు బ్యాంకు రుణాలు , రూ. 2కోట్లు దీర్ఘ కాలిక రుణాలు రైతులకు అందించినట్లు తెలిపారు. ఈ ఏడాది కోటి రూపాయల ఆదాయం సొసైటీకి వచ్చిందన్నారు. రుణాల రికవరీని కూడా 70 శాతం సాధించినట్లు తెలిపారు. త్వరలో రూ. 40 లక్షల వరకు సంఘం ద్వారా వివిధ రకాల రుణాలను అందించనున్నట్లు తెలిపారు. గృహ రుణాలు కూడా సంఘం ఆధ్వర్యంలో అందించనున్నట్లు తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా మీ సేవ తరహాలో సొసైటీలోనే అన్ని రకాల సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు ఎం. నాగేశ్వరరావు, జి. ఆదినారాయణ, ఎం. సింహాద్రి, జి. ముత్తిలింగం,జి. సుగుణ, జే. అనిత, బి. రామారావు, టి. బాసు, సిబ్బంది పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఎనిమిదేళ్లుగా సొసైటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహించి కేంద్ర సహకార బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్‌గా పర్మినెంట్ ఉద్యోగం సాధించి గార్లలో విధులు నిర్వహిస్తున్న జి. నరేష్‌ను ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, అధికారులు ఘనంగా సన్మానించారు.

## విద్యార్థులు లేక వెలవెలబోతున్న తాళ్లచెరువు ప్రీప్రైమరీ పాఠశాల

**- ఇద్దరు విద్యార్థులకు ఒక ఇన్‌స్ట్రక్టర్..ఒక ఆయా**
**- మండలంలోని ఇతర ప్రీ ప్రైమరీ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి?**
**- అధికారుల పర్యవేక్షణ లోపం.. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన ఆంగ్ల విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రీప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందించి, ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులను ఆకర్షించాలనే లక్ష్యంతో ఇన్‌స్ట్రక్టర్, ఆయా వంటి సిబ్బందిని కూడా నియమించింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మండల పరిధిలోని తాళ్లచెరువు ప్రీప్రైమరీ పాఠశాలలో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు సమాచారం. వీరి కోసం ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా విధులు నిర్వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇద్దరు విద్యార్థులు ఉండటంతో పాఠశాల ప్రాంగణం వెలవెలబోవడం గమనార్హం. ప్రీప్రైమరీ విద్య ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో లేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. మండలంలోని ఇతర ప్రీప్రైమరీ పాఠశాలల్లోనూ ఇదే తరహా పరిస్థితులు ఉన్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ సిబ్బందిని నియమిస్తున్నప్పటికీ విద్యార్థుల నమోదు పెంచడం, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించడం, పాఠశాలల పనితీరు నిరంతరం పర్యవేక్షించడం వంటి అంశాలపై అధికారులు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. తక్కువ మంది విద్యార్థులున్న ప్రీ ప్రైమరీ పాఠశాలను అన్నింటిని ఒకే చోటకు చేర్చి ఆంగ్ల విద్యను అందించేలేరా? ప్రీప్రైమరీలో చెప్పే ఆంగ్ల విద్యను ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అందించలేరా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు తోనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందా? లేక విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు తీసుకు రావడానికి ప్రత్యేక కార్యచరణ అవసరమా? అన్నది అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది.

## ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/మధిర:** సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ తెలంగాణ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, యువత, విద్యావేత్తలు, ప్రజలు విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి ఉగ్గం సురేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి ఉగ్గం సురేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రత్యోదమ కాలం నుంచి విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ వస్తున్న చారిత్రక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎప్ అని అన్నారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో విద్యా రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరగడం వలన పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులపై ఆర్థిక భారం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, యూనివర్శిటీలకు అవసరమైన మౌలిక వసతులు, అధ్యాపకులు, సిబ్బంది, నిధులు సమకూర్చి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అలాగే యూనివర్శిటీలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు సరిపడా హాస్టల్ సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజ రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లాలోన విద్యార్థులు, యవత, విద్యావేత్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఉగ్గం సురేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎప్ మధిర మండల కార్యదర్శి కళ్లెం అశోక్, మండల సహాయ కార్యదర్శి గుగులోతు హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేబీస్ వ్యాధిపై అవగాహన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రేబీస్ వ్యాధి నివారణకై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డా॥ ఎ. అరుణాదేవి, జిల్లా సైకియాట్రిస్టు డా॥ ఎండి సోహెల్ తెలిపారు. మూగ జనుల వారోత్సవాలు, రేబీస్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూగ జనులను సమాజంలో చిన్నచూపు చూడకుండా వాటికి ప్రోత్సాహం అందించాలన్నారు. రేబీస్ వ్యాధి సోకే విధానం, దాని లక్షణాలు, కుక్కకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.ఈ కార్యక్రమంలో సమన్వయ అధికారి ఎన్. సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమన్నారాయణ, కెవెస్ చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యూపిఐ చార్జీల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : రవి




**ప్రజాపక్షం/మధిర:** నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో డిజిటల్ చెల్లింపుపై అదనపు భారం మోపే విధానాలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి డిమాండ్ చేశారు. దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు వ్యాపార లావాదేవీలపై యండిఆర్ విధానాన్ని తీసుకురావడం చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులపై అదనపు ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉందన్నారు. కేంద్రలోని మోడీ ప్రభుత్వం ప్రకటించిన కొత్త విధానంలో రెండు వేలు పైబడిన నిర్దిష్ట వ్యాపారి లావాదేవీలకు ఎండిఆర్ వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలు, పన్నులు, వ్యాపార నిర్వహణ ఖర్చులతో సతమతమవుతున్న చిన్న వ్యాపారులపై మరో రకమైన చెల్లింపు వస్తువుల ధరలు పెరుగుదల రూపంలో వినియోగదారులపై పడే అవకావం ఉందని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలను, చిన వ్యాపారులను భారాల బాట పట్టించవద్దని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యుపిఐ వంటి ప్రజలకు ఉపయోగపడే డిజిటల్ చెల్లింపు వ్యవస్థను పూర్తిగా ఉచితంగా కొనసాగించడంతో పాటు చిన్న వ్యాపారులపై ఎలాంటి ఎండిఆర్ భారం లేకుండా స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బస్టాండ్ పనులను పరిశీలించిన జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



**ప్రజాపక్షం/మధిర:** మధిరలో నిర్మాణంలో ఉన్న నూతన బస్టాండ్ పనులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సోలమన్ శుక్రవారం పరిశీలించారు. ఆయనతో పాటు ఖమ్మం రీజనల్ మేనేజర్ ఎ.సరిరామ్, డిప్యూటీ ఆర్ఎం ఎ.రాజేశ్వర్‌రెడ్డి నూతన బస్టాండ్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధిర ఆర్‌టిసి డిపోను సందర్శించిన జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమన్ డిపోలోని ఆదాయం, వ్యయాల వివరాలను పరిశీలించారు. డిపో పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించి ఆదాయం పెంపు, ఖర్చుల నియంత్రణ, సంస్థకు మెరుగైన ఆర్థిక ఫలితాలు సాధించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగిన ఆదేశాలు సూచనలు ఇచ్చారు. డిపో నిర్వహణ, బస్సుల నిర్వహణ, ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడం ఆదాయాన్ని పెంచే అవకాశాలపై కూడా అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మధిర డిపో మేనేజర్ బస్టాండ్ పరిస్థితులను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మధిర డిపో మేనేజర్ టి.దేవరాజు, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.13.84 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** 35 మంది లబ్దిదారులకు మంజూరైన రూ.13.84లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాగమయి ముఖ్య అతిథిగా హాజరైనారు. పట్టణం, మండలానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.13,84,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీకి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు రూ.5,50,500, సత్తుపల్లి మండలానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు రూ.8,29,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానాబేగం కమల్ పాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# వెళ్లి రావయ్యా బొజ్జ గణపయ్యా

**- గోదావరిలో ఘనంగా నిమజ్జనోత్సవాలు**
**- పోటెత్తిన భక్తులు, పోలీసుల పటిష్ట చర్యలు**





**ప్రజాపక్షం/భద్రాచలం :** నవరాత్రుల పాటూ పూజలందుకున్న గణనాథులు ఎట్ట కేలకు గంగమ్మ ఒడికి చేరుతున్నారు. ఈ సందర్భంగా భద్రాచల పావన గోదావరి తీరంలో నిమజ్జనోత్సవాల సందండి మొదలైంది. రాష్ట్ర నలుమూలల నుండి గోదావరి తీరానికి పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు చేరుకున్నాయి. స్వామిని గోదావరిలో నిమజ్జనం చేస్తూ జై బోలో మహారాజ్‌కి జై.. వెళ్లి రావయ్యా బొజ్జగణపయ్య అంటూ భక్తిభావంతో నమస్కారాలు సమర్పిస్తున్నారు. గోదావరిలో వరదనీరు ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక లాంచీలు ఏర్పాటు చేసిన క్రైన్‌ల సహకారంలో విగ్రహాలను లాంచీపైకి ఎక్కించి ప్రత్యేక పూజల నడుమ పసుపు కుంకుమ నూనత వస్త్రాలు నవధాన్యాలు నదీమతల్లి ఒడిలో వదులుతూ స్వామిని గోదావరి మధ్యలో నిమజ్జనం చేస్తున్నారు. ఇందు కోసం పోలీసులు గట్టి బందో బస్తు నిర్వహిస్తున్నారు. నిమజ్జన సిబ్బందితో పాటు లాంచీల నిర్వాహకులకు లైఫ్ జాకెట్లు అందజేశారు. భక్తులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా ముందుస్తుగానే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా ఉండేందుకు ఎస్‌పి రోహిత్ రాజ్ నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఒకేసారి కరకట్టపైకి వాహనాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ క్రమ సంఖ్యలో విడిచిపెడుతున్నారు. నిమజ్జనాల అనంతరం వాహనాలు బయటకు వెళ్లే క్రమంతో పాటు పార్కింగ్ ప్రదేశాల్లో నిఘా పెట్టారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఇప్పటికే హెచ్చరించిన పోలీసులు నివారణ చర్యల్లో భాగంగా డ్రంగ్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. శోభాయాత్రతో బయలు దేరుతూ వస్తున్న వాహనాల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ డీజే శబ్దాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఓ ప్రక్క వర్షపు చినుకులతో వాతవారణ చిత్తడిగా మారడంతో నదీ తీరంలో జారిపోకుండా గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. నిమజ్జనోత్సవ కార్యక్రమం మరో రెండు రోజుల పాటు కొనసాగనుండటంతో కరకట్టతో పాటు పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. నదివద్ద గజీతగాళ్లను సిద్ధం చేసిన అధికారులు మైక్‌ల ద్వారా ప్రమాదాల నివారణ కోసం ప్రచారం సాగిస్తున్నారు. మెడికల్ క్యాంపు, ఫైరి సిబ్బంది క్షేత్రస్థాయిలో విధి నిర్వహిస్తున్నారు. మరో ప్రక్క గోదావరికి వరద తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట ఆదేశాలు జారీ చేశారు.

## భూ తగాదాలకు చెక్.. రికార్డుల్లో పక్కా లెక్క

**జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భూ తగాదాలకు చెక్ పెట్టి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే భూ సర్వే నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. స్పష్టం చేశారు. భూమి ఎంత ఉందో అంతే లెక్క.. సర్వేలో భూమినే ప్రామాణికంగా తీసుకుంటామని తెలిపారు. శుక్రవారం నేలకొండపల్లి మండలం కొంగర గ్రామంలో జరుగుతున్న భూ సర్వేను ఆయన పరిశీలించారు. వరి పొలాల్లో బురదను సైతం లెక్కచేయకుండా గట్లపై నడుస్తూ రైతుల వద్దకు వెళ్లిన కలెక్టర్ సర్వే విధానంపై అవగాహన కల్పించారు. రైతులు అడిగిన పలు సందేహాలు, అనుమానాలను నివృత్తి చేశారు. భూ సర్వే పూర్తయిన తర్వాత భూ వివాదాలకు అవకాశం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తుల మధ్య తలెత్తే పంచాయతీల్లో అధికారులు తలదూర్చరని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత వ్యక్తులే పరస్పరం సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సర్వే సమయంలో ప్రతి రైతు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, సర్వే పూర్తిగా రైతుల సమక్షంలోనే జరుగుతుందని తెలిపారు. రైతులకు ముందుగా నోటీసులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పరాస్ కుమార్, సర్వేయర్ ఏడీ రాజేందర్, నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆటోలతో వేగవంతంగా పారిశుద్ధ్యం : ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** వైరా పట్టణంలోని పారిశుధ్య సమస్యలను మరింత సమర్ధవంతంగా పరిష్కరించేందుకు వైరా మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నూతనంగా కొనుగోలు చేసిన స్వచ్ఛ ఆటోలను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రారంభించారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, చెత్త తరలింపు, ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణకు మెరుగుపరచడంలో ఈ స్వచ్ఛ ఆటోలు కీలకంగా ఉపయోగపడనున్నాయి. ప్రస్తుతం చెత్త సేకరణ, తరలింపులో ఎదురవుతున్న ఇబ్బందులను అదిగమించేందుకు కొత్త వాహానాలు అందుబాటులోకి రావడం ద్వారా పారిశుధ్య సిబ్బందికి కూడా వెసులుబాటు కలగనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు మున్సిపాలిటీ ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల నుంచి వెలువడే చెత్తను నిర్దేశిత విధానంలో పారిశుధ్య, సిబ్బందికి అందించి మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. స్వచ్ఛ ఆటోలను సక్రమంగా వినియోగిస్తూ ప్రతి వార్డులో చెత్త సేకరణ, తరలింపు నిరంతరాయంఅ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మన్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపాచంద్రకళ, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఆయా పోస్టుల ఎంపికపై అభ్యంతరాలు

**-పదో తరగతి అర్హతతో దరఖాస్తుదారుల పట్ల వివక్ష?**
**-పారదర్శకత పాటించి న్యాయం చేయాలని అభ్యర్థుల విజ్ఞప్తి**




**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండలంలో అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీ ప్రక్రియపై అభ్యర్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నోటిఫికేషన్‌లో పదో తరగతి, ఇంటర్ అర్హతలతో దరఖాస్తు చేసుకుటే అవకాశం కల్పించినప్పటికీ, ఎంపిక ప్రక్రియలో పదో తరగతి అర్హతతో దరఖాస్తు చేసిన వారిని పరిగణనలోకి తీసుకోలేదని కొందరు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. నోటిఫికేషన్ ఆధారంగా దరఖాస్తులు స్వీకరించిన అనంతరం చివరి దశలో తమను పక్కన పెట్టడం న్యాయసమ్మతం కాదని వారు పేర్కొంటున్నారు. ఈ ప్రక్రియతో ఆర్థికంగా, మానసికంగా నష్టపోయామని వాపోతున్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతల మేరకే అభ్యర్థులను పరిశీలించి, ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని కోరుతున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వడంతో పాటు పదో తరగతి అర్హతతో దరఖాస్తు చేసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వ్యవహారం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

## ఏళ్లుగా పేరుకుపోయిన పూడిక తొలగింపు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** నారాయణరావుపేట గ్రామ పంచాయితీ పరిధిలోని పొలూరిపేటలో ఇళ్ల మధ్య ఉన్న డ్రైనేజీ కాలువలో కొన్నేళ్లుగా చెత్తాచెదారం పేరుకుపోయి పూడిక ఏర్పడింది. దీంతో దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల సమస్యలపై స్పందించిన సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ జేసీబీ సహాయంతో కాలువలో పేరుకుపోయిన బురద, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించారు. డ్రైనేజీ కాలువను శుభ్రపరచడంతో స్థానికులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సురేందర్, ఉబ్బ సందీప్, పాయం చంటి, సొందే సుబ్బయ్య, పంచాయితీ సిబ్బంది కల్లూరి కామరాజు, పాయం చందు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మాదారంలో స్వచ్ఛతా హీ సేవా విజయవంతం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారం గ్రామ పంచాయితీ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించినట్లు సర్పంచ్ ఉమా నరేష్ తెలిపారు. నిమజ్జనం అనంతరం పూజా సామాగ్రి, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవా 2026లో భాగంగా గ్రామంలోని చెరువు, కుంట పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టి పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. నీటి వనరులను పరిశుభ్రంగా కాపాడుకోవాలనే అవగాహనను ప్రజల్లో కల్పించారు. గ్రామ ప్రజల సహకారం, పంచాయితీ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం విజయవంతమైందని సర్పంచ్ తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి విజయ్, ఇందిరమ్మ డైరెక్టర్ నరేష్ కుమార్, పంచాయితీ, పారిశుధ్య సిబ్బంది, పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫారాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు ఆధ్వర్యంలో 100 కెవి 3 ఫేస్ ట్రాన్స్‌ఫారాన్ని విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. గృహాలకు వినియోగించే కరెంటుతో వోల్టేజ్ రావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కౌన్సిలర్ ఫణితి సైదులు ఏడో వార్డుకి నాల్గో వార్డుకి కలిపి కొత్త ట్రాన్స్‌ఫారాన్ని ఏర్పాటు చేశారు. ఏడో వార్డు స్థానికులు కౌన్సిలర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, 7వ వార్డు కౌన్సిలర్ ఫణితిసైదులు, ముళ్లపాటి సీతారాములు, వేముల రత్నాకర్, శ్యామ్‌బాబు, చెరుకూరి శ్రీను, సరిపూడి కోటేశ్వరరావు, ఫణితి నాగార్జున అబ్బాస్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

**- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు**

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** 3టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుటుంబ వివాదానికి సంబంధించి పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఇరు వర్గాల ఏకంగా స్టేషన్ ఆవరణలో ఇరువర్గాలు ఘర్షణలకు పాల్పడమే కాకుండా పోలీసుల విధుల విధులకు ఆటంకం కలిగించడంతో పోలీసలు చట్ట పరమైన చర్యలు చేపట్టారు. కొరదల కుమార్ అతని భార్య వినోదకు సంబంధించిన కుటుంబ వివాదం నేపథ్యంలో ఇరు వర్గాలు శుక్రవారం స్టేషన్కు వచ్చాయి. ఈ క్రమంలో మాటలు పెరిగి ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనను అదుపు చేసే క్రమంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను సైతం ఇరు వర్గాల వారు నెట్టేసి విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై ఆందిన ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తులను అదుపులోనికి తీసుకుని అరెస్టు చేసి నాయ్యస్థానంలో హాజరు పరిచినట్లు డిఎస్‌పి ఆదినారాయణ తెలిపారు. అదే విధంగా గణేష్ నిమజ్జనంలో తల్వార్‌తో ఇబ్బందులు కలిగించిన నలుగురు వ్యక్తులను సైతం అరెస్టు చేశారు.

## 3వ అదనపు కోర్టు మంజూరు

**- అనందోత్సవాల్లో బార్ అసోసియేషన్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం పట్టణంలో 3వ అదనపు కోర్టును మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బార్ అసోసియేషన్ ఆనందోత్సవాల్లో మునిగిపోయింది. 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరు కావడంతో కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఈ నూతన కోర్టు మంజూరుకు సంపూర్ణ సహకారాన్ని జస్టిస్ భీమపాక నగేష్, ఖాజా శరత్ అందించడంతో కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావుకు బార్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం భౌగోళికంగా విస్తీర్ణమైందని, సుదూర ప్రాంతాల నుండి వచ్చే గిరిజనులు పేద ప్రజలకు ఈ 3వ అదనపుకోర్టు ద్వారా కేసుల విచారణ వేగవంతం అవుతుందని తెలిపారు. ఐఖ్యతతో జిల్లా అదనపు కోర్టును కూడా సాధించుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారితో పాటు తాదా లలిత, చైతన్య, సీనియర్ న్యాయవాదులు రామ్మోహన్, వైఎస్‌ఆర్ శర్మ, అవులూరి సత్యనారాయణ పామరాజు తిరుమలరావు, అరుణ, ఎంవి రమ బండారు రమేష్ ఉప్పు నాగేంద్ర దాట్ల సంధ్య రవితేజ కార్తీక్ రామకృష్ణ రాంబాబు గాయత్రి రాజేష్ శ్రీనివాస్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిభావం, ఐక్యతకు ప్రతీక గణనాధుల శోభాయాత్ర

**- ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భక్తిభావం సమాజంలో ఐక్యతను పెంపొందించడానికి వినాయక చవితి ఉత్సవాలు నిమజ్జం సందర్భంగా గణనాధుడి శోభాయాత్ర గొప్ప ప్రతీక అని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబ శివరావు అన్నారు. గణనాధుడి నిమజ్జన శోభాయాత్రను పురస్కరించుకుని పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొన్నారు. తొలుత స్వామివారి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల జయజయధ్వనాల నడుమ గణనాధుల శోభాయాత్రంను ఎంఎల్‌ఏ ప్రారంభించారు. అనంతరం త్రీటౌన్ సెంటర్లో ఏర్పాటు చేసిన స్వాగత వేదికవద్దకు చేరుకుని వివిధ ప్రాంతాల నుండి భద్రాచలం గోదావరి తీరానికి తరలుతున్న విగ్రహాలకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఒక్కచోట చేరి ఐఖ్యంగా జరుపుకునే ఇలాంటి ఉత్సవాలు సామరస్యానికి నిదర్శనం అన్నారు. మన సాంప్రదాయాలు సంస్కృతిని కాపాడుకుంటూ రాబోయే తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఎంతో భక్తితో కొలిచిన విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రజలు సంయమనంతో శోభాయాత్రను శాంతియుత వాతావరణంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేటర్ సిరిపురపు లలిత కుమారి, కాంగ్రెస్ నాయకులు కంచర్ల చ oద్ర శేఖర్, నాగ సీతారాములు, లక్ష్మీ ప్రసన్న, కోనేరు చిన్ని, లక్ష్మ ణరావు యెర్ర కామేష్ దేవాదాయశాఖ కార్యదర్శి రజని పాల్గొన్నారు.

# భూ సమస్యపై నిజాలు నిగ్గు తేల్చాలి

**-జ్ఞానేష్‌కుమార్ దేశ ద్రోహి**

**-అక్టోబర్ ఐదు, ఆరు తేదీల్లో ఆందోళనలు**

**-మీడియా సమావేశంలో పోటు రంగారావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం భూ వ్యవహారంపై నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని చివరకు కమిషన్ల పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని 22ఎ సహా భూముల సమస్యలపై నిజాలు నిగ్గు తేల్చాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఇరు పార్టీలు భూ సమస్యపై విమర్శ, ప్రతివిమర్శలతో ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని ఆయన తెలిపారు. శుక్రవారం సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కొత్త వారికి పింఛన్లు ఇవ్వాలని, మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలను ఎత్తివేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రంగారావు డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని బిజెపి సంఘంగా మార్చిన జ్ఞానేష్‌కుమార్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య ద్రోహిగా జ్ఞానేష్ వ్యవహరించారని ఇంతటి తీవ్ర నేరం చేసిన నరేంద్ర మోడీ, అమిత్‌షాల అండతోనే జ్ఞానేష్ చేశారని ఆయన తెలిపారు. ఓట్ల తొలగింపు, ఫలితాల తారుమారు వల్లే బిజెపి అధికారంలోకి వచ్చిందని 2024 తర్వాత జరిగిన అన్ని ఎన్నికలను రద్దు చేసి తిరిగి




ఎన్నికలు నిర్వహించాలన్నారు. జ్ఞానేష్‌కుమార్ ద్రోహంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నామని ప్రజాస్వామిక వాదులు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. సమస్యలను వదిలి తిట్ల దండకంతో కాలయాపన చేస్తున్న విపక్ష, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అక్టోబర్ ఐదు, ఆరు తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, ఝాన్సీ, శిరోమణి, శోభ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కట్టెల మండెలు, టింబర్ డిపోలను తొలగించాల్సిందే..

**-సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కట్టెల మండెలను, టిండర్ డిపోలను జనావాసాల మధ్య నుంచి తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. శుక్రవారం శ్రీనివాస్ నగర్‌లో వెంకటసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. భూక్యా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ శ్రీనివాస్ నగర్ ఇండ్ల తొలగింపుకు సంబంధించి నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఇండ్లు కూల్చరాదని సిపిఎం పోరాడిందన్నారు. సిపిఎం నేత సుదర్శన్ మాట్లాడుతూ సిపిఎం దశల వారి పోరాటం కారణంగానే ఇండ్ల కూల్చివేతలను ఆపుకోగలిగామన్నారు. 500 కుటుంబాల విషయంలో ఎటువంటి పోరాటానికైనా జంకేది లేదన్నారు. కట్టెల మండెలు, టింబర్ డిపోల కారణంగా ఈ ప్రాంతంలో వాతావరణం కలుషితం అవుతుందని ఆయన తెలిపారు. ఒకప్పటి కంటే ఈ ప్రాంతం ఇప్పుడు బాగా విస్తరించిందని విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు వచ్చాయన్నారు. కాలుష్యంతో ప్రజలకు నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. కొందరు నిరుపేదల ఇండ్లను ఖాళీ చేసేందుకు కుట్ర పూరిత చర్యలకు పాల్పడుతున్నారని దీనిని సిపిఎం సహించదన్నారు.ఈ రౌండ్ టేండ్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి విక్రం, బండారు రమేష్, యర్రా శ్రీనివాసరావు, పొన్నం వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నేతలు దొడ్డా నగేష్, పాపారావు, మేకల శ్రీనివాసరావు, సైదులు, తిరుపతిరావు, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో ముమ్మరంగా పారిశుధ్యం

**ప్రజాపక్షం/ తల్లాడ :** అన్నారుగూడెం గ్రామాన్ని పరిశుభ్రతకు ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్థానిక సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.



అన్నారుగూడెం రామాలయం పరిసరాల నుంచి బిసి కాలనీ అంతటా పారిశుధ్య పనులు చేపట్టి పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ వంశీ, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు రోశయ్య, జగ్గయ్య, నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు, పంచాయతీ గుమస్తా రమేష్, పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వాగుల ఉధృతిపై అధికారుల అప్రమత్తత

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలో ఎడతెరిపి లేకుండా కురస్తున్న వర్షాల నేపథ్యంలో వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. బిల్లుపాడు, రామచంద్రాపురం,



గొల్లగూడెం ప్రాంతాల్లో వాగుల ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. వాగుల వద్ద రాకపోకలు సాగించకుండా రహదారులపై వాహనాలను అడ్డంగా ఏర్పాటు చేసి ప్రజలు వాహన రాకపోకలు చేయకుండా నియంత్రించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపివో శ్రీహరికృష్ణ లు మాట్లాడుతూ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్త వెంకటగిరి సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ రామకృష్ణ చారి, ఎంపిడివో, సూపరింటెండెంట్, బిల్లుపాడు పంచాయతీ కార్యదర్శి సాయి, గొల్లగూడెం సెక్రటరీ నరేష్, బిల్లుపాడు పంచాయతీ సిబ్బంది పవన్ పాల్గొన్నారు.

# నేడు సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 26 శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతుందని జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. ప్రస్తుత రాజకీయాలు, ఎన్నికల కమిషనర్ వ్యవహారం, ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

# పలువురిని పరామర్శించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/ కొణిజర్ల :** ఇటీవల కాలంలో వివిధ సందర్భాల్లో కుటుంబ సభ్యులను కోల్పోవడంతో పాటు ఇతరత్రా నష్టపోయిన పలు కుటుంబాలను సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేతృత్వంలో శుక్రవారం పరామర్శించారు. అమ్మపాలెం గ్రామంలో మనిగ రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామంలో తేజావత్ హరి అతని భార్య ఇద్దరు ఒకే రోజు చనిపోవడంతో వారి పిల్లలను పరామర్శించి ఓదార్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ కుటుంబాలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా సురేష్ తెలిపారు. మనో ధైర్యంతో ముందుకు సాగాలని బాధితులకు సూచించారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పిటిసి యర్రా బాబు, మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, నాయకులు మునిగ కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ షేక్ గాలిబ్ పాషా, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు, వెంపటి నర్సారావు, వెంకన్న, పరశురాములు, రాము, శ్రీను, సత్యం, సైదులు, రవీంధర్ పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్ 19 అడుగులుకు చేరిన నీటి నిల్వ



**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్‌కు జలకల సంతరించుకుంది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన అకాల వర్షాలకు రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరడంతో 19 అడుగులకు నీటి నిల్వ సామర్థ్యం చేరింది. దీంతో రిజర్వాయర్ అలుగులు పారడంతో వైరా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. వర్షం కురవడం పట్ల రిజర్వాయర్‌లోకి భారీగా నీరు రావడంతో రిజర్వాయర్ కుడి, ఎడమ ఆయకట్టు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గోవిందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి సుమన్ చక్రవర్తి, డిఐఈవో రవిబాబు లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27న ఆదివారం సాయంత్రం లకారం ట్యాంకు బండ్ వద్ద కలెక్టర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో కలశం ఊరేగింపు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలోని వాసవి కన్వెన్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని తొమ్మిది రోజుల పూజలో భాగంగా తల్లాడలో కలశం ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య మండల సంఘం అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంబూరి మోహన్‌రా వు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంబూరి నారాయణరావు, వెంకటేశ్వరరావు, కనకయ్య, నాగన్న, నాగేశ్వరరావు, నగేష్, జవాజి, శ్రీను, నర్సింహారావు, మురళీ, సంతోష్, కాశీ, నెహ్రూ, శంకర్, కనకయ్య, మణికంఠ పాల్గొన్నారు.

# తరంగ్ 2 పర్వతంపై తొలి భారతీయ బృందం అధిరోహణ



**ప్రజాపక్షం/ తల్లాడ :** హిమాచల్ ప్రదేశ్‌లోని మియార్ వ్యాలీ ప్రాంతంలో సముద్ర మట్టానికి సుమారు 6,021 మీటర్ల ఎత్తులో ఉన్న తరంగ్ 2 పర్వతాన్ని తొలి భారతీయ బృందం అధిరోహించి రికార్డు సృష్టించింది. 10 మంది సభ్యులతో కూడిన ఈ బృందంలో తెలంగాణకు చెందిన పర్వతారోహకులు కూడా ఉన్నారు. వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన బర్మావత్ మోతి కుమార్ ప్రత్యేకంగా నిలిచారు. హైదరాబాద్ కేంద్రంగా పర్వతారోహణకు శిక్షణ అందించే ట్రాన్స్‌అండ్ అడ్వెంచర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ పర్వతారోహణ చేపట్టారు. పర్వతం దిగువ ప్రాంతంలోని బెస్ క్యాంపు నుంచి ఈనెల 11న నైరుతి మార్గంలో బృందం ట్రెక్కింగ్ ప్రారంభించింది. అనంతరం 22వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు తరంగ్ 2 పర్వత శిఖరాగ్రానికి చేరుకుని విజయవంతంగా అధిరోహించింది. ఈ బృందంలో బర్మావత్ మోతికుమార్, రాజ్‌కుమార్, విస్తావత్ బన్ని లతో పాటు హిమాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన పర్వతారోహకులు పాల్గొన్నారు. బర్మావత్ మోతికుమార్ ఖమ్మంజిల్లా తెలంగాణ రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ పర్వతారోహకుడు. ఇప్పటికే పలు ఎత్తయిన పర్వతాలను అధిరోహించిన ఆయన తరంగ్ 2 పర్వతారోహణలో పాల్గొని భారత జాతీయ జెండాను ఎత్తయిన శిఖరంపైకి తీసుకెళ్లే లక్ష్యంతో యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు.